వారం రోజుల క్రితమే ఓ బాంక్ జాబ్ కోసం హైదరాబాద్‌లో రిటెన్ టెస్ట్‌కి ఎటెండ్ అయి వచ్చాను. ఇంతలోనే అనుకోకుండా మళ్ళీ హైదరాబాద్ వెళ్ళాల్సి వస్తుందనుకోలేదు. రైలు చార్జీలకే జేబులు గుల్లయి పోతాయి. కాని వెళ్ళక తప్పదు. అప్పుడెప్పుడో నేను రాసిన టెస్ట్‌లో సెలక్ట్ అయినట్లు, ఇంటర్వ్యూకి రమ్మని ఓ సిమెంట్ కంపెనీ నుంచి లెటర్ వచ్చింది నిరుద్యోగం నిలువు గుడ్డేసుకుని యువతరాన్ని కబళించాలని చూసే ఈ రోజుల్లో ఈ ఛాన్స్ వదులు కోగల నా?



## సీసా చెట్టు

మానవుడు పరిణామదశలో ప్రకృతిలో కనిపించే చెట్లనుంచీ, జంతువులు, పక్షుల నుంచీ ఎన్నో విషయాలు నేర్చుకున్నాడు. సీసా తయారీ కూడా మనిషి చెట్టును చూసే నేర్చాడా అనిపిస్తుంది. ఆస్ట్రేలియాలో పెరిగే 'బాటిల్ ట్రీ' అనే వృక్షాన్ని చూస్తే దీని కాండం మధ్యన ఉబ్బి సరిగ్గా సీసా ఆకారంలో ఉంటుంది. నలభై నుంచి నలభై అయిదు అడుగుల ఎత్తుకు ఎదిగే ఈ మహావృక్షం మధ్య భాగం పన్నెండు నుంచి పదమూడు అడుగుల వ్యాసాన్ని కూడా కలిగి ఉంటుంది.

-కె. ఆర్. కె. మోహన్

గత వారం వెళ్ళినప్పుడు మూర్తి గా డింట్లో ఓ రోజు ఉన్నాను. నిజానికి ఆ ఇల్లు వాడి స్వంతం కూడా కాదు. హైద్రాబాద్‌లోనే ఓ చిరుద్యోగం వెలగబెడుతూ, వాళ్ళ చిన్నాన్న గారింట్లో ఉంటున్నాడు. వాళ్ళదీ మధ్య తరగతి కుటుంబమే. అయినా వారు నన్నెంతగా ఆదరించారనీ? పార్వతమ్మ గారైతే నన్ను కూడా ఓ కొడుకు లాగానే ట్రీట్ చేశారు. ఒక్క రోజులోనే నేను మా ఇంట్లోనే ఉన్నానా అనుకునేంత ప్రేమాభిమానాల్ని కురిపించారు. బయటికి చెబితే మరీ నాటకీయంగా ఉంటుందేమో అని భయపడ్డాను గానీ, మనసులో నైనా వారి ఉన్నత సంస్కారానికీ, చూపించిన ఆదరానురాగాలకీ కృతజ్ఞతలు చెప్పుకోక పోతే నా కన్నా కృతఘ్నుడు ఉండ డేమో!

హైదరాబాద్ వస్తున్నట్టు, ముందుగా మూర్తి గాడికి ఉత్తరం రాస్తే తెలియబరి చేంత వ్యవధి లేక పోవడంతో ఆదరా బాదరాగా బయల్దేరాను. జేబులో పైకం కూడా బొటా బొటీగా ఉంది. అయితే ఈ సారి మూర్తి దగ్గర తిష్ఠ వేసి వారికి మరింత భారం కావడం నా కిష్టం లేదు. గత సారి నేను తిరిగి వచ్చేస్తున్నప్పుడు 'మళ్ళీ హైదరాబాద్ వచ్చినప్పుడు తప్పక రా బాబూ' అని పార్వతమ్మగారు ఆప్యాయంగా అన్నారు కూడా. అంత మాత్రాన మళ్ళీ వెళ్ళి ఇబ్బంది కలిగించ గలనా? ఇంటర్వ్యూ అయిపోగానే రైలెక్కి మా ఊరొచ్చేద్దా మనుకున్నాను.

'తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తున్న సామెత ఉండనే ఉందిగదా తీరా వెళ్ళాక తెల్సింది - ఇంటర్వ్యూ ఏవేవో కారణాల వల్ల మర్నాటికి వాయిదా పడిందని.

చచ్చినట్లు మూర్తిగాడి దగ్గరి కెళ్ళాల్సొచ్చింది. అప్పటికి మూర్తి ఐతే ఇంట్లో లేడు గానీ, పార్వతమ్మ గారే తలుపు తీశారు.

"నువ్వా.... రా బాబూ.. రా"' ఎక్కడో విదేశాల్లో చదువు కొంటున్న కొడుకు హఠాత్తుగా ఇంటికి వస్తే ఎలా ఉంటుందో అలాంటి మెరుపు ఆమె కళ్ళలో. అయినవారే భారమైన ఈ రోజుల్లో, తన బావగారి కొడుక్కి ఫ్రెండ్ అయిన ఓ అనామకుణ్ణి ఆదరించగలిగే సహృదయత ఈ కరువు రోజుల్లో ఎవరి కుంటుంది? ఆమెను 'అమ్మా' అని పిలిచి, ఆ పిలుపులోని మాధుర్యంతో నా గుండెల్లో గూడు కట్టుకున్న కృతజ్ఞతా భావాన్ని వెలిబుచ్చాలని నాలో బలమైన కోరిక.

నేను మొహం కడుక్కుని వచ్చేసరికి టేబిల్‌పైన పెసరట్లు వేడి వేడిగా పొగలు చిమ్ముతోంది. దాన్ని చూడగానే ఒక్క సారిగా ఆకలి తన్ను కొచ్చింది. కాదనకుండా మూడు పెసరట్లు లాగించేసరికి ఉదర రాముడు కాస్త శాంతించాడు... అచ్చం అమ్మ చేతి వంట రుచితో వున్న కాఫీ తాగేసరికి ప్రయాణపు బడలిక అంతా పోయి ఆ క్షణంలో ఉత్సాహం వచ్చేసింది.

మరో ముప్పావు గంటలో మూర్తి రానే వచ్చాడు. "హారోరి.నువ్వే నట్రా?" ఆనందంతో కౌగి లించేసుకున్నాడు నన్ను చూడగానే వెనుకే వచ్చిన వాడి కజిన్ కూడా "మీరా?" అన్నాడు పలకరింపుగా, నిష్కల్మషంగా నవ్వుతూ.

వారి ఆదరణ చూస్తుంటే నా కళ్ళు చెమరుస్తున్నాయి. కలకాలం ఆ ఇంట్లోనే ఉండిపోతే బాగుణ్ణనే స్వార్థం నాలో కువకువ లాడుతోంది.

కాలేజీ కహానీలు నెమరు వేసుకుంటూ, ఆ రోజుల్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ, ఆ తీపి స్మృతుల్లోనే ఏ రాత్రికో నిద్రలోకి జారుకున్నాం మిత్రు లిద్దరం.

గాఢ నిద్రలో ఉన్నవాడిని బయట ఆలికిడికి దిగ్గున లేచాను. గేటు దగ్గర ఓ ఆడగొంతు పార్వతమ్మగారి మీద బిగ్గరగా కేకలేయడం గమనించగానే నా మత్తంతా వదిలిపోయి కిటికీ దగ్గరకు పోయి నిల్చున్నాను. ఎప్పుడు లేచాడో, మూర్తి ఆలికిడే లేదు.

కొబ్బరాకు సందుల్లోంచి సూర్యకిరణాలు వాలుగా పార్వతమ్మగారి ముఖం మీద గీతల్లా కదులుతుంటే దోషిలా తలదించుకుని వున్నా రామె.

'ఇంకా ఎప్పుడమ్మా తీర్చేది? ఇదిగో, అదిగో అంటూనే ఇన్ని రోజులు గడిపేశావ్. మర్నాడు మళ్ళీ ఇచ్చేస్తానని తీసుకెళ్ళావ్. నువ్వేదో మర్యాదస్థురాలివని ఇచ్చాను గానీ, ఇలా మాట నిలబెట్టుకోలేని దానివని తెలిస్తే ఆ నాడే కాదని చెప్పేసే దాన్ని'' ఆ కొత్త మనిషి వయసులో పార్వతమ్మగారి కన్నా బాగా పెద్దే అయినా మాటల్లో ఆ పెద్దరికాన్ని నిలబెట్టుకోలేక పోతోంది.

"అది కాదు వర్ధనమ్మగారు వెంటనే తీర్చేద్దామనే అనుకున్నా కానీ కాస్త అడ్జస్ట్‌మెంట్‌లో తేడా వల్ల..'' పార్వతమ్మ గారింకా ఏదో చెప్పబోయేంత లోనే గయ్యిన లేచింది వర్ధనమ్మ.

"ఎడ్జెస్టమెం టేమిటమ్మా ఎడ్జస్టమెంట్? అత్యవసరమని మరీమరీ ప్రాధేయపడితే ఇచ్చాను గానీ ఛీ ఛీ.. ఇలా పదిసార్లు అడిగించుకుంటా వనుకోలేదు. ఇంకా ఎన్నాళ్ళ కౌతుందట తమరి ఎడ్జస్టమెంటు?'' వ్యంగ్యంగా మూతి ముప్పయి వంకరలు తిప్పుతూ దబాయిస్తోందామె...


"మరో రెండు రోజు లాగితే. మీ బాకీ తప్పక తీర్చేస్తాను. మా పరిస్థితి మీకు తెలీని దేముంది? అప్పటికీ ఒక్క రోజు కనీసావసరాల్ని కూడా తీర్చుకోలేక పోతున్నాం...'' పార్వతమ్మ గారి గొంతు నూతిలోంచి వస్తున్నట్టుగా వణుకుతోంది.

వీథిలో చాలా మంది అమ్మలక్కలు చోద్యం చూస్తూ గుమిగూడా రప్పటికే.

"అంటే ఏమిట మ్మా నీ ఉద్దేశం? మా దగ్గరేదో ఎకువైపోయి నీకు అప్పిచ్చాననుకుంటున్నావా? లేక తీర్చకపోయినా కొంపేం మునగదులే అనుకుంటున్నావా? అయినా మా ఇళ్ళకు బంధువులు, స్నేహితులు రావడం లేదా? నీ లాగే ఆడంబరానికి మేం దిగుతున్నామా? వారం క్రితం ఓ కుర్రా డెవరో వచ్చాడని చెప్పి పట్టు కెళ్ళావ్‌గా? అతిథి మర్యాదలు అప్పుచేసే చెయ్యాలా? హైదరాబాద్‌లో ఉండడం ప్రతి అడ్డమైన వాడికీ అలుసై పోయింది. చెప్పాపెట్ట కుండా చేతిలో కాణీ లేకుండా దిగబడి పోవడం, మన దుంప తెంచడం..'' నిష్ఠూరంగా మెటికలు విరుస్తోంది.

"వర్ధనమ్మ గారూ! ప్లీజ్ కాస్త నెమ్మదిగా మాట్లాడండీ .....మనల్ని నమ్ముకుని వచ్చిన వారు అడ్డమైన వారు ఎందుకౌతారండీ? అందునా ఆ కుర్రాడు మా 'మూర్తి'కి క్లోజ్ ఫ్రెండ్. అతను కూడా ఓ బిడ్డలాంటి వాడే గదండీ..'' ఎంత నెమ్మదిగా అంటున్నా పార్వతమ్మ గారి మాటలు నాకు వినిపిస్తూనే ఉన్నాయి.

వారు అనుకుంటున్న ఆ కుర్రాణ్ణి నేనే అని గ్రహించే సరికి వేయి సమ్మెటలు నా నెత్తిన పడ్డట్టయింది. ఉలికి పాటుతో మనసు కాసేపు భావరహితం అయిపోయింది. నా కోసం అప్పు చేశారా? అది తీర్చలేని పరిస్థితిలో ఉన్నారా?



నా కైతే పార్వతమ్మగారిది మధ్య తరగతి కన్నా ఓ మెట్టు పైనే ఉన్నట్టని పిస్తుంది. మరీ లేని వారేం కాదు గదా? అప్పు చేయాల్సినంత అవసరం ఏ మొచ్చింది? గత సారి నా కోసం స్పెషల్‌గా రకరకాల కూరలతో, పచ్చళ్ళతో గుమాయించే భోజనం పెట్టిన మాట నిజమే. నేను వద్దన్నా కొసరి కొసరి వడ్డించినదీ నిజమే. కాని దాని వెనుక ఇంత కథ ఉందా?

కేవలం నా వల్లనే గదా అగచాట్లు? ఆ అమృతమూర్తి పైన ఇన్ని ఆరోపణలు... నా హృదయం వేదనతో దహించుకుపోతోంది. కనుల ముందు నీటి పొర కమ్మి మసక బారిపోయింది.

బయట వర్ధనమ్మ గొంతు ఇంకా హెచ్చుతోంది.

ఏమనుకున్నారో ఏమో! "కాసేపుండండి' అంటూ పార్వతమ్మగారు లోని కొచ్చారు. నేను నిస్త్రాణగా కుర్చీలో కూలబడిపోయాను.

బహుశా బాకీ తీర్చేశారేమో, ఆ తర్వాత వర్ధనమ్మ గొంతు వినబడలేదు.

అప్పటికే నేను ఓ నిర్ణయాని కొచ్చాను. స్నానాదులు ముగించి త్వరగా అక్కడ నుంచి బయల్దేరాలని. నేను ఉండే ప్రతి క్షణం వారి కెంత అవస్థో తేల్చుకోలేక పోతున్నాను.

"స్నానానికి నీళ్ళు పెట్టాను..రా బాబూ.." అన్న పార్వతమ్మగారి పిలుపుతో టవల్ అందుకుని బాత్‌రూమ్ కేసి నడిచాను.

అక్కడ, మూర్తి చెంబుడు నీళ్ళతో ముఖం కడుక్కుంటు న్నాడు.

"ఏరా! స్నానం చేయవా?" అడిగాను.

వాడు నవ్వుతూ నన్ను బాత్ రూంలోకి లాక్కుపోయాడు. నా మీదకి వంగి రహస్యం చెబుతున్నట్టుగా నా చెవిలో గుస గుస లాడసాగాడు.

"ఇందాక నువ్ చూసిన ఆ 'రుణ మేళా' 'అప్పు ప్రహసనం' ఏమిటనుకున్నావ్? ఈ హైదరాబాద్‌లో నీటి సమస్య విజయనగరంలో ఉన్న నీకు తెలీదేమో గాని మాకు మాత్రం దిన దిన గండమే.. ఏ రోజు నీళ్ళు వస్తాయో, అసలొస్తాయో రావో తెలీదు. వచ్చినా ఓ బకెట్ అయినా నిండుతుందో లేదో అనుమానమే. అందుకే చాలా జాగ్రత్తగా వాడుతుంటాం. వారానికి నాలుగు రోజులు స్నానానికే దిక్కుండదు.

"గత వారం నువ్వొచ్చినప్పుడు, స్నానానికి నీళ్ళ కోసమని ఓ బిందెడు నీళ్ళు అప్పు తెచ్చిందిలే మా పిన్ని.. తీర్చడం కాస్త లేటయ్యే సరికి జరిగిన హంగామా నువ్వు చూశావుగా. పది లక్షలు అప్పు తీసుకుని పరారై పోయినా పర్వాలేదు గానీ, పది మిల్లీ గ్రామ్‌ల మంచినీళ్ళు తీసుకుని ఇవ్వక పోయావో ఇక నీ పని అవుట్...!

"ఈ వేళ నా కోసం ఉంచిన నీళ్ళు అప్పు తీర్చడానికి పనికొచ్చాయన్నమాట....అందుకని ఇవేళ్టికి నాకు వాయు స్నానమే గతి. నువ్వు కానియ్." గీతోపదేశం చేస్తున్న శ్రీ కృష్ణుడిలా పోజిచ్చాడు వాడు.

నాకు ఓ వైపు నవ్వు, ఓ వైపు జాలి కలుగుతున్నాయ్. ఇంతటి గొడవకి కారణమైన నీళ్ళను తలచుకుంటే నవ్వు... ఈ నీళ్ళే బంగారమై బ్రతుకుతున్న వీళ్ళని చూస్తుంటే జాలి.

ఓ హైదరా 'బాధీయుడా'! నీకు జోహార్!

అరచేతిలో స్వర్గాలు చూపించే ఓ మిథ్యా ప్రభుత్వమా! జిందాబాద్.

కేవలం
ఒకే ఒక 5 రూ॥లతో
మీ అబ్బాయి / అమ్మాయి
భవిష్యత్తుముడిపడివుంది.
నమ్మ లేక పోతున్నారా?

మీ అబ్బాయి / అమ్మాయి
ఈ ఏడాది పదవ తరగతి చదువుతుంటే
పై మాటలు అక్షరసత్యం

పదవ తరగతి విద్యార్థుల కోసం

నాయుని కృష్ణ మూర్తి సంపాదకత్వంలో నెలనెలా వెలువడే

పాఠశాల

పత్రిక కొని చదివితే
మీ చిరంజీవి ఎక్కువ మార్కులతో
ఉత్తీర్ణత సాధించే అవకాశం వుంది.

ఒక్క మార్కు ఎక్కువైనా
భవిష్యత్తు పైన ఆ మార్కు ప్రభావం చాలావుంటుంది.

సంశయించకండి......
మీ చిరంజీవి భవిష్యత్తుతో పోలిస్తే
5 రూ॥ విలువైనవి కావు.

నేడే కొని చదివించండి

విడిప్రతి వెల : 5 రూ.
సంవత్సర చందా : 50 రూ.

ప్రతి చందాదారుడికీ సంవర్గమాన పట్టికలు, గణిత సూత్రాలు, భౌతిక స్థిరాంకాలు, రసాయన మూలకాలు, ఇంగ్లీషు తెలుగు వ్యాకరణం కలిసిన

పాఠశాల విజ్ఞానవాణి ఉచితం. ఉచిత పుస్తకం జూలై 30వ తేదీలోపల చందా పంపినవారికి మాత్రమే!

PATASALA
CHOWDEPALLE — 517 257 CHITTOOR Dt. A.P.